జోరుగా వరినాట్లు

● కురుస్తున్న వర్షాలకు నదీ తీర పొలాల్లో ఊపందుకున్న నాట్లు
● సోనా రకం సాగుకే మొగ్గు



అగసనూరు గ్రామ సమీపంలో నాట్లు వేస్తున్న కూలీలు

కోసిగి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరి పంట సాగు చేసేందుకు అన్నదాతలు సిద్ధమయ్యారు. తుంగభద్ర నదీ తీరంలో అరకొరగా నీరు ప్రవహిస్తుండడంతో వరి నాట్లు వేసుకునేందుకు పొలాల్లో ట్రాక్టర్లతో బురద సేద్యం చేస్తున్నారు. మరి కొందరు నాట్లు ప్రారంభించారు. ఈ నెల చివరి వారం నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు వరి నాట్లు వేస్తారు. నియోజకవర్గంలో కోసిగి, కౌతాళం, మంత్రాలయం మండలాల్లోని నదీ తీర గ్రామాల్లో ఖరీఫ్‌లో దాదాపు 8,200 ఎకరాల్లో వరి పంట సాగవుతుంది. ఇందులో కోసిగి మండలంలో 2,100 ఎకరాలు, మంత్రాలయం 1,600 ఎకరాలు, కౌతాళం మండలంలో 4,500 ఎకరాల్లో సాగు చేస్తారు.

సోనా సాగు వైపే మొగ్గు..

ఖరీఫ్‌లో అత్యధికంగా ఎన్‌డీఎల్‌ఆర్‌–7, ఆర్‌ఎన్‌ఆర్, సోనా రకం వరి సాగు చేస్తున్నారు. వర్షం అనుకూలిస్తే మంచి దిగుబడి వస్తుందని అన్నదాతలు చెబుతున్నారు. ఎకరాకు 40 నుంచి 50 బస్తాలు వరకు దిగుబడి వస్తుందని, గత నాలుగేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురిశాయని, ఈ ఏడాది కాస్త ఆలస్యమయ్యాయని, అయినా ఈ వర్షాలు కొనసాగితే రైతులకు ఇబ్బందులు ఉండవని పేర్కొంటున్నారు.

వరి సాగు చేసే గ్రామాలు..

కౌతాళం మండలంలోని కౌతాళం, బదినేహాల్, కంటనహాల్, వల్లూరు, గుడి కంబాలి, మరలి, నదిచాగి, మేళిగనూరు, కోసిగి మండలంలోని కడదొడ్డి, లక్ష్మీనగర్ క్యాంప్, కందుకూరు, అగసనూరు, సాతనూరు, బత్ర బొమ్మలాపురం, తుంబిగనూరు గ్రామాలు. మంత్రాలయం మండలంలోని నారాయణపురం, కాచాపురం, తుంగభద్ర, రాంపురం, చెట్నిహళ్లి, మంత్రాలయం గ్రామాల్లో వరి సాగు చేస్తారు.

వరి నాట్లు వేస్తున్నాం



మూడు రోజులుగా వర్షాలు కురుస్తుడడంతో పొలాలను దుక్కి దున్ని వరి నాటు వేసుకునేందుకు సిద్ధం చేస్తున్నాం. నాకున్న మూడున్నర ఎకరాల్లో ఎన్‌డీఎల్‌ఆర్‌–7 రకం వరి సాగుచేస్తున్నా. తుంగభద్ర నది పుష్కలంగా ప్రవహిస్తే మంచి నాణ్యమైన దిగుబడి వస్తుంది.

– టికే భీమన్న, అగసనూరు

గతేడాది మంచి దిగుబడి లభించింది



నాకున్న రెండెకరాల పొలంలో ఏటా వరి సాగు చేస్తున్నా. గత నాలుగేళ్లగా వర్షాలు సమృద్ధిగా కురిసి తుంగభద్ర నది ఏప్రిల్ వరకు ప్రవహించింది. దీంతో రెండు పంటలు సాగు చేశాం. ఎకరాకు 45 నుంచి 50 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది కూడా వరుణ దేవుడు కరుణించాలి.

– విశ్వనాథ్, సాతనూరు

విత్తనశుద్ధి చేసుకోండి



వరి పంట సాగు చేసే రైతులు వరి నారును ఫ్లోరోఫైరిపాస్ ద్రావణంతో శుద్ధి చేసుకుని నాట్లు వేసుకోవాలి. దీంతో తెగుళ్లు రాకుండా నివారించుకోవచ్చు. రైతులు తమ గ్రామాల్లోని ఆర్బీకేల్లోని వ్యవసాయ సిబ్బందిని కలిసి సలహాలు, సూచనలు పొందాలి. సబ్సిడీ పరికరాలు, వ్యవసాయ పనిముట్లు, ఎరువులకు కూడా ఆర్బీకేల్లో సంప్రదించాలి.

– రాజు, వ్యవసాయాధికారి

క్లుప్తంగా

పౌష్టికాహార కిట్ల పంపిణీ



క్షయ బాధితులకు కిట్లను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఆదోనిటౌన్: పట్టణంలోని క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, డాక్టర్ షేకుస్‌భాను పంపిణీ చేశారు. బుధవారం స్థానిక టీబీ యూనిట్‌లో నిత్యావసర కిట్లను పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీహెచ్‌ఎస్ బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని 15 మంది క్షయవ్యాధిగ్రస్తులకు టీబీ యూనిట్ డాక్టర్, సిబ్బంది సౌజన్యంతో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. క్షయ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, నివారణ చర్యలను వివరించారు. ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

కౌతాళం: కౌలు కార్డుల కోసం కౌలు రైతులు దరఖాస్తుల చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కార్డుల జారీకి ప్రభుత్వం మరోసారి అవకాశం ఇచ్చిందని, కౌలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 28వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులు చేసుకుని కార్డు పొందవచ్చన్నారు. పొలం యజమాని అంగీకారం పత్రంతో పాటు రైతు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్ కాపీలతో స్థానిక రైతు భరోసా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుని కార్డు పొందవచ్చన్నారు. ఇప్పటికే మండలంలో 7వందల మందికి కార్డులు ఇచ్చినట్లు తెలిపారు. ఇంకా 4వందల కార్డులు ఇవ్వాల్సి ఉందన్నారు.

రోడ్డును బాగు చేయాలి



అధ్వానంగా మారిన రోడ్డును చూపుతున్న సీపీఎం నాయకులు

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలోని తిమ్మప్ప రోడ్డు అధ్వానంగా మారిందని, రోడ్డును వెంటనే బాగు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.వెంకటేశులు సంబంధిత అధికారులను కోరారు. ఆయన బుధవారం గ్రామంలో పర్యటించి అధ్వానంగా మారిన రోడ్డును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ రహదారి గుండా స్కూటర్లు, వాహనాలు, ప్రజలు నడిచేందుకు కూడా వీల్లేకుండా తయారైందన్నారు. అలాగే ఫారెస్టులో రోడ్డు దాదాపు ఒకటిన్నర కిలో మీటర్ మేర అధ్వానంగా మారిందన్నారు. ఆయకట్టు రైతులు ఇదే దారి వెంబడి రాకపోకలు సాగిస్తుంటారని, తక్షణమే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. గ్రామ నాయకులు హనుమంతరెడ్డి ముత్తన్న, వీరన్న, నరసప్ప తదితరులు ఉన్నారు.

28న కళాశాలల బంద్‌కు పిలుపు

ఆదోనిఅర్బన్: రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్, ప్రయివేట్, ప్రభుత్వ కళాశాలల బంద్‌ను ఈనెల 28వ తేదీన చేపట్టనున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కామాక్షి వెంకట్ తెలిపారు. ఈ మేరకు బుధవారం బంద్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ అధిక ఫీజులకు వ్యతిరేకంగా, లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్య అందించాలన్న డిమాండ్లతో బంద్ చేస్తున్నట్లు చెప్పారు.

అతిసార పట్ల అప్రమత్తంగా ఉండాలి

కోసిగి: కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, ముఖ్యంగా అతిసార వ్యాపించొచ్చని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి మనోజ్‌కుమార్ సూచించారు. బుధవారం సబ్‌సెంటర్ పరిధిలో పర్యటించి రోగులకు వైద్య సేవలు అందించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. వాంతులు, విరేచనాలు తీవ్రం కావడంతో వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరిని ఆదోని ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు ఆయన తెలిపారు. చిర్తనకల్లు గ్రామానికి చెందిన మారెమ్మకు వాంతులు, విరేచనాలు అధికం కావడంతో కోసిగిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అలాగే కోసిగి రెండవ వార్డుకు చెందిన నాగరాజుకు కూడా తీవ్ర వాంతులు విరేచనాలు కావడంతో ఆదోనికి రెఫర్ చేసినట్లు చెప్పారు. 1వ వార్డుకు చెందిన నరసమ్మ, 6వ వార్డుకు చెందిన ఉరుకుందమ్మ కూడా వాంతులు,విరేచనాలతో బాధపడుతుండగా స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామని వివరించారు.

మద్యం విక్రేతల అరెస్ట్

ఆదోనిరూరల్: మండలంలోని చిన్నహరివాణంకు చెందిన వందవాగిళి నరసప్ప 66 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను (90 ఎంఎల్) అమ్ముతుండగా, అలాగే కపటి గ్రామంలో వీరాంజనేయులు అనే వ్యక్తి 16 టెట్రా ప్యాకెట్లను అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఇస్వి ఎస్ఐ శ్రీనివాసులు బుధవారం విలేకరులకు తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. అక్రమ కర్ణాటక మద్యంపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు.

‘జగనన్న సురక్ష’తో సమస్యల పరిష్కారం





ధ్రువ పత్రాలను అందజేస్తున్న దృశ్యం, వలంటీర్లకు సేవమిత్రా, సేవరత్న అవార్డులను అందజేసిన దృశ్యం

కౌతాళం: జగనన్న సురక్ష కార్యక్రమంతో గ్రామాల్లో సమస్యలకు పరిష్కారం లభించిందని ఎంపీపీ అమరేష్ పేర్కొన్నారు. జగనన్న సురక్ష పథకం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక సచివాలయం–3లో ఎంపీడీఓ సుబ్బారాజు, సర్పంచ్ పాల్‌దినకర్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించి వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఉత్తమ వలంటీర్లకు సేవరత్నా, సేవమిత్ర అవార్డులను అందజేసి సన్మానించారు. మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, కో ఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, ఉప సర్పంచ్ తిక్కయ్య, నాయకులు చౌదరి బసవ, నాగభూషణ్‌గౌడ్, ఆర్‌బి రాజశేఖర్ పాల్గొన్నారు.

మంత్రాలయం : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి పేర్కొన్నారు.



ధ్రువ పత్రాలు అందజేస్తున్న నాయకులు

బుధవారం మండలంలోని చెట్నేహళ్లి, మంచాల–3 సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో మణిమంజరి, ఈఓపీఆర్డీ ప్రభావతి, సర్పంచ్‌లు అంజిని, తెల్లబండభీమయ్య, ఎంపీటీసీ సభ్యులు రామాంజనేయులు, ఉపసర్పంచ్ వీరనాగప్ప ఉన్నారు.





కడ్లేగూడు పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం, కోసిగిలో గోనెగండ్లయ్య పీర్లదేవుడిని ఊరేగిస్తున్న దృశ్యం

భక్తి శ్రద్ధలతో చిన్న సరిగెత్తు

కౌతాళం: మండల కేంద్రంలో కడ్లేగూడు (సుత్తందేవర ఊరేగింపు) ఉత్సవం భక్తిశ్రద్ధలతో సాగింది. బుధవారం స్థానిక కాకిపీర్ వీధి నుంచి పీర్లను ఊరేగించారు. భక్తులు పీర్లకు మొక్కులు చెల్లించుకున్నారు. ఇమామేఖాసీం (గంటెప్ప దేవర) సరిగెత్తు గురువారం తెల్లవారుజామున ఉంటుందని ఖాదర్‌లింగ స్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా తెలిపారు.

కోసిగి: మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం సాయంత్రం చిన్న సరిగెత్తును ఘనంగా నిర్వహించారు. పెద్ద మజీద్ సమీపంలోని పీర్లచావిడి నిర్వహకులు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి గోనెగండ్లయ్య పీరును మేళతాళాలు, తప్పెట్ల మధ్య గ్రామంలోని చౌడమ్మ వీధి వరకు ఊరేగించి, చావిడికి చేర్చారు. అలాగే నురాణిసున్నీ మజీద్, కుమ్మరి వీధిలోని చావిళ్లలో కొలువుతీరిన పీర్లకు చిన్న సరిగెత్తు నిర్వహించారు.

నేడు పీఎం కిసాన్ డబ్బులు జమ

హాలహర్వి: ఈనెల 27వ తేదీన అర్హులైన రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ 14వ విడత ఆర్థిక సాయం జమ అవుతుందని మండల వ్యవసాయ అధికారి శివశంకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పున నగదు జమ అవుతుందన్నారు.

పైర్లను కాపాడుకోవాలి

గోనెగండ్ల: వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మిగనూరు ఏడీఏ ఎస్.మహమ్మద్ ఖాద్రి, గోనెగండ్ల ఏఓ హేమలత సూచించారు. బుధవారం వారు మాట్లాడుతూ.. పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా, చిన్న చిన్న కాలువల ద్వారా బయటకు పంపాలన్నారు. అధిక తేమ వల్ల పత్తి, మిరప, ఉల్లి పైర్లకు వేరుకుళ్లు సోకి మొక్కలు చనిపోతున్నట్లు గమనించామన్నారు. వేరుకుళ్లు నివారణకు వర్షం తగ్గిన తర్వాత కాపర్ ఆక్సీక్లోరైడ్ (బ్లైటాక్స్, బ్లూ కాపర్) 3 గ్రాములు లేదా కార్బెన్డజీమ్ (బావిస్టిన్) 2 గ్రాములు లీటరు నీటికి కలుపుకొని మొక్క మొదలు తడిసేలా పిచికారీ చేయాలన్నారు. వర్షం తగ్గిన తరువాత ఎకరా పొలంలో 30 కిలోల యూరియా, 25 కిలోల పోటాష్ ఎరువులను పైపాటుగా వేసుకోవాలన్నారు.

మోసాలకు పాల్పడితే చర్యలు

కర్నూలు (న్యూసిటీ): తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు హెచ్చరించారు. బుధవారం ఆయన నగరంలని సీ క్యాంప్, కొత్త బస్టాండ్, రాజ్‌విహార్ తదితరల ప్రాంతాల్లో రైస్, కిరాణం, ఫర్టిలైజర్ షాపులను పరిశీలించారు. రాజ్‌విహార్ వద్ద ఉన్న ఓ రైస్ దుకాణంలో బియ్యం బస్తాను తూకం వేయగా 26 కేజీలకు గానూ కేజీ తక్కువ ఉండటంతో 4 కేసులు, రైస్ బస్తాలపై తయారీదారుడి చిరునామా లేకపోవడంతో రెండు కేసులు నమోదు చేసి రూ.లక్ష జరిమానా విధించామని ఆయన తెలిపారు.

నేరస్తులను కఠినంగా శిక్షించాలి



ఆదోనిలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలియజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఆదోనిరూరల్: మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీ మహిళలపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మణి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, పీవైఎల్ యువజన సంఘం నాయకులు రసూల్ అన్నారు. ఈ మేరకు బుధవారం వారు పట్టణంలోని ప్రధాన రోడ్డులో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ ఘటన దేశానికే మాయని మచ్చ అన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా కుకీ తెగకు చెందిన ఇద్దరు ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారం చేసి హతమార్చడం దారుణమన్నారు. గిరిజన ఆదివాసీలు, మైనార్టీలపై దాడులు జరుగుతున్నా బీజేపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. హింసాత్మక ఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు మహాదేవమ్మ, మల్లికార్జున, వెంకప్ప, మల్లికార్జున, పవన్, సునీల్, మహేష గర్జప్ప, చెన్ను, వీరేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆదోని గణేష్ సర్కిల్‌లో కూల్చివేతను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోనిటౌన్: ఆదోని పట్టణంలో అక్రమ కట్టడాల కూల్చివేత పనులను మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, టీపీఓ శ్రీనివాసులు, వార్డు కౌన్సిలర్ ఉమామహేశ్వరిఆనంద్ ఆధ్వర్యంలో చేపట్టారు. బుధవారం 4వ వార్డు గణేష్ సర్కిల్ ఏరియాలో ఇళ్ల ముందు రోడ్డును ఆక్రమించుకుని చేపట్టిన నిర్మాణాలను తొలగించారు. కూల్చివేత పనులు పగడ్బందీగా నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. కట్టడాల కూల్చివేతలో ఎవరినీ ఉపేక్షించవద్దని టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంజీ ట్యాంకు మస్టర్ పాయింట్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది, ఉద్యోగుల హాజరును తనిఖీ చేశారు. పట్టణంలో ప్రధాన కాలువ ఆవుదొడ్డి వంకను పరిశీలించారు. వంకలో పూడికను ఎప్పటికప్పుడు తొలగించి, వరద నీరు సాఫీగా వెళ్లేలా చూడాలని శానిటరీ విభాగం అధికారులకు సూచించారు. స్థానిక భాష్యం స్కూల్‌ను సందర్శించారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించుకోవాలని, వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాల్సిందిగా పాఠశాల యాజమాన్యానికి సూచించారు. పాఠశాలల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని ఉపాధ్యాయులను కోరారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

ఆదోని సెంట్రల్: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించడంతో పాటు, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల వివరాలను స్టూడెంట్ ఇన్ఫర్మేషన్ పోర్టల్‌లో నమోదు చేయాలని మండల స్పెషల్ అధికారి సుబ్రమణ్యం, ఎంపీడీఓ గీతవాణి, ఎంఈఓ శివరాములు తెలిపారు. పట్టణంలోని భాష్యం, కృష్ణదేవరాయ, చైతన్య, నేషనల్ పాఠశాలల్లో బుధవారం వారు పర్యటించి విద్యార్థు ల వివరాలను ఎంతవరకు నమోదు చేశారని అడిగి తెలుసుకున్నారు. పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో 57, 421 మంది విద్యార్థులను పోర్టల్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. ఇంకా పట్టణంలో 5,750 మంది, గ్రామీణ ప్రాంతంలో 5,004 మంది విద్యార్థుల వివరాలు నమోదు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. 5 ఏళ్లు నిండిన పిల్లలను 1వ తరగతిలో చేర్చుకోవాలన్నారు.



పాఠశాల కరస్పాండెంట్ గోపాల్‌రెడ్డితో మాట్లాడుతున్న అధికారులు

పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల రీ అడ్మిషన్

పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఫెయిలైన విద్యార్థులను రీ అడ్మిషన్ చేసుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే విద్యాకానుక, అమ్మ ఒడి వంటి పథకాలన్నీ వారికీ వర్తింపజేస్తామని తెలిపారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

సచివాలయ సీఆర్‌పీలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహించి బడి ఈడు పిల్లలను తప్పకుండా నమోదు చేయాలని తెలిపారు. ఇప్పటివరకు 100 శాతం పూర్తి చేసిన వాలంటీర్లు పట్టణంలో 17 మంది, గ్రామీణ ప్రాంతంలో 11 మంది ఉన్నట్లు తెలిపారు. వంద శాతం పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను ప్రధానం చేస్తున్నట్లు తెలిపారు. బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

-బి.శివరాములు, మండల విద్యాధికారి, ఆదోని

పిల్లలందరినీ బడిలో చేర్పించాలి



పెద్దకడబూరులోని వెంకటసాయి ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న నాగరాజునాయుడు



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న డీఈఓ రంగారెడ్డి



కౌతాళంలోని ఎస్‌డబ్ల్యూ పాఠశాలను తనిఖీ చేస్తున్న ప్రత్యేక అధికారి

కోసిగి: బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించి సంపూర్ణ విద్యార్థుల నమోదు చేయించాలని డీఈఓ రంగారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం, బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బడి ఈడు పిల్లలందరిని గుర్తించి బడిలో చేర్పించేందుకు ప్రధానోపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. జిల్లాలో మండలంలోనే ఎక్కువగా పిల్లలు మధ్యలోనే బడిమానేస్తున్నారని, అలాంటి వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఇంటింటికీ తిరిగి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి బడిలో చేర్పించేలా చూడాలన్నారు. అలాగే 5 ఏళ్లు నిండిన పిల్లలను ప్రాథమిక పాఠశాలలో, 5వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు హౌ స్కూల్‌లోనూ, 10వ తరగతి విద్యార్థులు పాస్ అయిన వారిని కళాశాలలో, ఫెయిల్ అయిన విద్యార్థులను మళ్లీ 10వ తరగతిలోనే చేర్పించాలని చెప్పారు. ఎంఈఓ–1 మొయినుద్దీన్, ఎంఈఓ–2 నాగేశప్ప, బాలుర హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్, రాజమౌళి, సీఆర్‌పీ అనంతరామ్ పాల్గొన్నారు.

కౌతాళం: ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండాలని మండల ప్రత్యేక అధికారి ఆచార్యులు తెలిపారు. మండల ప్రత్యేక అధికారిగా బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓ సుబ్బారాజు, ఎంఈఓ శోభరాణి, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం స్థానిక ఎస్‌డబ్ల్యూ పాఠశాల, నారాయణ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ డ్రాప్ ఔట్స్, సిస్టమ్ డ్రాప్ ఔట్స్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించి వారికి అందుతున్న విద్య మధ్యాహ్న భోజనం గురించి ఆరా తీశారు. హెచ్‌ఎం శివకుమార్ పాల్గొన్నారు.

పెద్దకడబూరు : బడిఈడు పిల్లలు బడి బయట కనిపించరాదని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు తెలిపారు. ఎంపీడీఓ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 6 నుంచి 14సంవత్సరాల పిల్లలు బడిలోనే ఉండాలని సూచించారు.పెద్దకడబూరు మండలంలో 11,555 మంది పిల్లలు ఉంటే అందులో 11మంది మాత్రమే బడి బయట ఉన్నట్లు గుర్తించామన్నారు. మండల ప్రత్యేకాధికారి వెంకటేష్, ఎంపీడీఓ, ఎంఈఓ పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: బడి ఈడు పిల్లలు బడిలో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాధికారి రంగారెడ్డి సూచించారు. బుదువారం కోసిగి, ఆదోని మండలాల్లో ఆయన పర్యటించారు. ఆదోని మండలం పెద్దతుంబళం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పట్టణంలోని ఎయిడెడ్ మసూదియా అరబిక్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు లేని చోట నియమించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించారన్నారు. డీఐ ఆదామ్ బాష, మండల విద్యాధికారులు బి.శివరాములు, పి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రాలయం : మండలంలోని విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్యతో కలిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వర్షపు నీరు స్లాబ్ గోడల్లో నుంచి లీక్ అవుతుండటంతో పాఠశాల పై కప్పును పరిశీలించి వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు వీలుగా లేకపోవడంతో ఇలా జరిగిందని సమస్యను గుర్తించారు. వెంటనే సమస్యను పరిష్కారించాలని పాఠశాలకాంట్రాక్టర్ కరుణాకర్‌రెడ్డిని ఆదేశించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఆదోనిఅర్బన్: పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని అనాథ మహిళ బుధవారం మృతి చెందింది. ఆలయం దగ్గర భిక్షాటన చేస్తూ జీవించే అనాథ మహిళ మృతి చెందినట్లు సమాచారం తెలుసుకున్న టూటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాసనాయక్ ఆధ్వర్యంలో పోలీసులు అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కౌతాళం: మండలంలోని తోవి గ్రామంలో బుధవారం రాత్రిఅక్రమంగా విక్రయిస్తున్న కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకొని శంకర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశామని కోసిగి సీఐ ఎరిషావలి, ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. శంకర్ నుంచి 6 బాక్స్‌లు.. 576 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. శంకర్‌ను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు పేర్కొన్నారు.

ప్రశాంతంగా జీవించండి

వెల్దుర్తి: గొడవలు, అల్లర్ల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామం మల్లెపల్లె గ్రామస్తులకు సూచించారు. బుధవారం రాత్రి ఆయన గ్రామంలోని పికెటింగ్‌ను పరిశీలించిన అనంతరం పీర్ల చావిడి వద్ద గ్రామస్తులతో సమావేశమయ్యారు. పీర్ల పండుగలో అవాంఛనీయ సంఘటనలకు తావివ్వవద్దన్నారు. సీఐ యుగంధర్, ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.

వర్షాలపై అప్రమత్తం

ఎమ్మిగనూరురూరల్: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఆంజనేయులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మరో మూడు రోజులు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ సూచనల మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత మిద్దె ఇల్లు ఉన్నవారు వర్షాలు తగ్గే వరకు ఇతర ప్రాతాల్లో ఉండాలని సూచించారు.

ఆలూరు రూరల్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వీఆర్వోలు ఆయా గ్రామ ప్రజలను అప్రమత్తం చేయాలని మండల తహసీల్దార్ రామాంజనేయులు సూచించారు. ఆయన మండలంలోని ఆలూరు–చిప్పగిరి రహదారిలో ఉన్న కల్లె వంకను పరిశీలించారు. వంతెన కింది భాగంలో పేరుకుపోయిన మట్టి, చెత్తను తొలిగించాలని ఉపాధి హామీ పథకం సిబ్బందిని ఆదేశించారు. వాహనదారులు, రైతులు వంకలు, వాగులు దాటేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో సేవలందించేలా ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆపదలో ఉన్న వారు సంబంధిత వీఆర్వో, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఇదిలాఉండగా తుపాను ప్రభావంతో మంగళవారం సాయంత్రం 3 గంటల నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. ప్రజలు బయటికి వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

బైకులు ఢీకొని నలుగురికి గాయాలు

ఆదోని అర్బన్: మండలంలోని చిన్నహరివాణం గ్రామ సమీపంలో రెండు బైకులు ఢీకొని బుధవారం రాత్రి నలుగురికి గాయాలయ్యాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. చిన్నగొనేహాల్‌కు చెందిన మోహన్, చిన్న ఈరన్న, గోవిందు ఒక బైకుపై వెళ్తుండగా వెనక నుంచి చిన్నహరివాణం గ్రామానికి చెందిన ఈరన్న బైకుతో ఢీకొట్టడంతో కింద పడిపోయారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇస్వీ పోలీసులు వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

కాచి వడబోసిన నీటిని తాగాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రస్తుతం ఎల్లెల్సీలో వర్షపు నీరు ఒండ్రుతో కలిసి వస్తోందని పట్టణ ప్రజలు కొళాయిల ద్వారా వచ్చే మంచి నీటిని కాచి వడబోసి చల్లార్చి తాగాలని మున్సిపల్ కమిషనర్ బుధవారం సూచించారు. అదేవిధంగా కలుషిత ఆహారం, చల్లని ఆహార పదార్థాలు తినకూడదన్నారు. ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని, వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

డ్రైవర్లు కంటి చూపు కాపాడుకోవాలి



మాట్లాడుతున్న ఆర్టీఓ నాగేంద్ర, కంటి వైద్యుడు జెషన్ అహమ్మద్

ఎమ్మిగనూరుటౌన్: ఆటో, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు నడిపే డ్రైవర్లు కంటి చూపు పట్ల జాగ్రత్తలు పాటించాలని ఆర్టీఓ నాగేంద్ర, ఏఎంవీఐ సుధాకర్ రెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ శాఖ కంటి వైద్య నిపుణులు జెషన్ అహమ్మద్ సూచించారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని క్లస్టర్ హెల్త్ సెంటర్‌లో ఆర్టీసీ బస్సులు, ఆటో, జీపు, ట్రాక్టర్లు తదితర వాహన డ్రైవర్లకు రవాణా శాఖ ఆధ్వర్యంలో కంటి వైద్యులు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కంటి పొరలు వచ్చిన వారికి శస్త్ర చికిత్సలు సైతం ఆరోగ్యశ్రీ ద్వారా చేయించనున్నట్లు తెలిపారు. కంటి అద్దాలు అవసరమైన వారికి వారం రోజుల్లోగా అందిస్తామన్నారు. వాహన డ్రైవర్లకు కంటి సమస్యలు వస్తే సత్వరం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో 40 మంది డ్రైవర్లకు కంటి పరీక్షలు చేశారు. రవాణా శాఖ హెడ్‌కానిస్టేబుళ్లు నాగేశ్వరరావు, ఎండీ ఆజమ్, చెన్నప్పతో పాటు వైద్య సిబ్బంది ఉన్నారు.